తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
బుధవారం
28 అక్టోబర్ 2026
Follow :

# ఏడుపాయల మంజీరా నదిలో తల్లి, ఇద్దరు కుమార్తెల కోసం గాలింపు

### నది ఒడ్డున చెప్పులు, సెల్‌ఫోన్ గుర్తింపు



**కొల్చారం, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా కొల్చారం మండలం ఏడుపాయలకు వెళ్లే మొదటి బ్రిడ్జి సమీపంలోని మంజీరా నదిలో తల్లి, ఇద్దరు కుమార్తెల ఆచూకీ కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గంగుల సరిత (27), ఆమె కుమార్తెలు వైష్ణవి (7), శివానిక (6) మంజీరా నది వద్దకు వచ్చినట్లు సమాచారం. నదిలోకి వెళ్లే ముందు తన అక్కకు ఫోన్ చేసి, పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, నది ఒడ్డున వారి చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. దీంతో మెదక్ అగ్నిమాపక సిబ్బంది సహకారంతో నదిలో గాలింపు చేపట్టారు. అయితే, ముగ్గురి ఆచూకీ లభించలేదు. సమాచారం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ ఎం. కృష్ణమూర్తి, కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహినుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు.

# రైతులకు అండగా హరీష్ రావు పర్యటన

### నవంబర్ 2న వనపర్తి జిల్లాలో ఎండిన వరిపంటల పరిశీలన.. రైతుల్లో ఆత్మస్థైర్యం నింపడమే లక్ష్యం

### హరీష్ రావు పర్యటన విజయవంతానికి బీఆర్ఎస్ శ్రేణులకు నిరంజన్ రెడ్డి దిశానిర్దేశం



**వనపర్తి రూరల్, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతలు, సాగునీటి కొరత, ఎండిపోతున్న వరిపంటల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు అండగా నిలిచేందుకు మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు నవంబర్ 2న వనపర్తి జిల్లాలో పర్యటించనున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. రైతులను నేరుగా కలిసి వారి కష్టాలను తెలుసుకొని, వారిలో ఆత్మస్థైర్యం నింపడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. హరీష్ రావు పర్యటనను విజయవంతం చేయడంతోపాటు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. బలిజేపల్లి, జంగమాయపల్లి జంట గ్రామాలతోపాటు పామిరెడ్డిపల్లి, అంకూర్, వెంకటాపూర్, చికారు చెట్టు తండా, ముందరి తండా గ్రామాలకు చెందిన కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగంలో ముందుచూపుతో వ్యవహరించి రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దిందని అన్నారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులతోపాటు సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇచ్చి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచిందని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన ప్రణాళిక, ముందుచూపు లేకపోవడం వల్లే రైతులు విద్యుత్ కష్టాలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. బొగ్గు సరఫరా, విద్యుత్ నిర్వహణలో నిర్లక్ష్యంతోపాటు, కృష్ణా జలాల వినియోగంలో ప్రభుత్వ వైఫల్యం కారణంగా సాగునీటి సమస్యలు తీవ్రమయ్యాయని ఆరోపించారు.

**నీటిని సద్వినియోగం చేసుకుంటేనే రైతులకు మేలు**

కృష్ణా జలాల వినియోగంపై నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా నీరు చేరినప్పటికీ, సరైన సమయంలో కేఎల్ఐ పంపులను ప్రారంభించకపోవడంతో నీటిని సద్వినియోగం చేసుకోలేకపోయామని ఆరోపించారు. నార్లాపూర్ పంపులను సకాలంలో ప్రారంభించి ఉంటే సాగునీటి అవసరాలకు మరింత నీటిని వినియోగించుకునే అవకాశం ఉండేదని అన్నారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎల్‌నినో వంటి కారణాలను సాకుగా చూపుతోందని విమర్శించారు. శ్రీశైలం జలాశయంలో అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించి, కేఎల్ఐ ద్వారా ఎత్తిపోసి చెరువులు, వట్టెం, కర్వెన రిజర్వాయర్లను నింపితే వానాకాలం పంటలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని నిరంజన్ రెడ్డి సూచించారు. 2న హరీష్ రావు చేపట్టనున్న పర్యటనలో భాగంగా ఎండిపోయిన వరిపంటలను పరిశీలించి, బాధిత రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటారని నిరంజన్ రెడ్డి తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, వారికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జగదీశ్వర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, వేణు యాదవ్, శ్రీనివాస్ గౌడ్, పలువురు సర్పంచులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ డ్రోన్ పోటీకి గీతం క్యాడెట్ల ఎంపిక



**పటాన్చెరు అక్టోబర్ 27 (జనంసాక్షి) :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని ఎన్.సి.సి. క్యాడెట్లు మరోసారి తమ సత్తా చాటారు. అఖిల భారత అంతర్-డైరెక్టరేట్ డ్రోన్ పోటీ 2026లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ (ఏపీటీ) డైరెక్టరేట్ కు ప్రాతినిధ్యం వహించడానికి ఇద్దరు గీతం ఎన్.సి.సి. క్యాడెట్లు ఎంపికయ్యారు. తమిళనాడులోని తిరుచెంగోడ్ లో గల కె.ఎస్. రంగస్వామి కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ (కేఎస్ఆర్సీటీ)లో ఈనెల 23 నుంచి నవంబర్ 4 వరకు జరుగుతున్న పోటీలలో పాల్గొంటున్నారు. జాతీయ స్థాయి పోటీకి తెలంగాణ నుంచి కేవలం నలుగురు క్యాడెట్లు మాత్రమే ఎంపికవగా, ఇద్దరు గీతం హైదరాబాద్ ఎన్.సి.సి. విద్యార్థులు కావడం గమనార్హం. ఎంపికైన క్యాడెట్లు- జూనియర్ అండర్ ఆఫీసర్ ఎ.అభినవ్ సాయి కార్తీక్ (సీనియర్ డివిజన్), జూనియర్ అండర్ ఆఫీసర్ తమ్మలూరి కావ్య (సీనియర్ వింగ్). వారి ఎంపిక డ్రోన్ కార్యకలాపాలలో వారి అంకితభావం, సాంకేతిక నైపుణ్యం, కృషి, ప్రతిభ, నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. గీతం అసోసియేట్ ఎన్.సి.సి. అధికారి లెఫ్టినెంట్ అజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పోటీలో క్యాడెట్లు డైరెక్టరేట్ కు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణం అన్నారు. గీతం హైదరాబాదు ఉన్నతాధికారులు కూడా ఈ ఇద్దరు క్యాడెట్ల అద్భుతమైన విజయాన్ని అభినందించి, వారు ఇదే ఉత్సాహాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగించి, మరిన్ని విజయాలను అందుకోవాలని అభిలషించారు.

# గంజాయి సేవించిన వ్యక్తిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు



**బెజ్జంకి,అక్టోబర్ 27 (జనంసాక్షి) :** బెజ్జంకి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్లూరు గ్రామం నుంచి ఖాసీంపేట గ్రామానికి వెళ్లే మార్గంలో మంగళవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు అన్నాడి కళ్యాణ్ రెడ్డి (27) అనే వ్యక్తిని అనుమానాస్పదం నడవడికను గుర్తించి విచారించారు.అతను గంజాయి సేవించినట్లు గుర్తించగా,పంచుల సమక్షంలో నిర్వహించిన పరీక్షలో టీహెచ్‌సీ ఫలితం పాజిటివ్‌గా వచ్చినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి,తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

**మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ఎస్సై తోట తిరుపతి**



యువతతో పాటు,ప్రజలందరూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై తోట తిరుపతి సూచించారు. మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యంతో పాటు కుటుంబం,భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు.ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాల అక్రమ వినియోగం, సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి,సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై తిరుపతి తెలిపారు.

# ఈవీఎం గోదాం తరలింపునకు ప్రత్యామ్నాయ వసతులను పరిశీలించిన కలెక్టర్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 27(జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమీపంలో ప్రస్తుతం ఉన్న ఈవీఎం గోదాం జాతీయ రహదారి--167 కే నిర్మాణ పనుల పరిధిలోకి వస్తున్న నేపథ్యంలో, ఈవీఎం గోదాంను నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించేందుకు అవసరమైన ప్రత్యామ్నాయ భవన వసతులను అదనపు కలెక్టర్ బి చేన్నయ్య, నాగర్ కర్నూల్ ఆర్డీఓ అర్చన లతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎం గోదాం ఏర్పాటుకు అనువైన గదులను పరిశీలించిన కలెక్టర్ గోదాం తరలింపునకు అవసరమైన తాత్కాలిక ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.నూతన ఈవీఎం గోదాం నిర్మాణం పూర్తయ్యే వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) భద్రత, రక్షణ, నిల్వకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర భద్రతాపరమైన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు.ఈవీఎం గోదాం తరలింపు ప్రక్రియను చేపట్టే ముందు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల నుంచి నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అనుమతులు లభించిన అనంతరమే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం తరలింపు చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్ ఇతర అధికారులు ఉన్నారు.



# యాదవ కాలనీవాసుల దశాబ్దాల నిరీక్షణకు తెర

### సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ మద్దిలేటి

**శ్రీరంగాపూర్, అక్టోబర్ 27 జనం సాక్షి :** శ్రీరంగాపూర్ బస్టాండ్ సమీపంలోని యాదవ కాలనీలో ఏళ్లుగా సీసీ రోడ్డు లేక గుంతలమయమైన మట్టిరోడ్డుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులకు ఎట్టకేలకు తెరపడింది. కాలనీవాసులు, సమీప పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు సర్పంచ్ మద్దిలేటి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించి, మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. దశాబ్దాల నాటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్ మద్దిలేటి గారికి గ్రామస్థులు, కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు మెంబర్ పుష్పలత, చింతల రామకృష్ణ, నాయకులు సతీష్ యాదవ్, కాంట్రాక్టర్ కృష్ణ సాగర్, సూపర్‌వైజర్ శంకర్, కాలనీవాసులు వసంతపురం పెంటయ్య, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




# మత్తు పదార్థాల నిర్మూలనకు విస్తృత తనిఖీలు

### ఎస్సై రమేష్

### నార్కోటిక్స్ స్నైపర్ జాగిలంతో బస్ స్టాండ్, దుకాణాలలో సోదాలు

**మక్తల్, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో మత్తు పదార్థాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా పోలీసులు ఉట్కూరులో విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఉట్కూర్ ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో ఉట్కూర్ మండల కేంద్రంలోని బస్ స్టాండ్, పాన్ షాపులు, కిరాణం షాపులతో పాటు పలు రద్దీ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు మరియు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు ఈ పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు. ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్నా, రవాణా చేస్తున్నా లేదా సరఫరా చేస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై రమేష్ కోరారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. ?ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# మఖ్తల్‌లో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

### సరైన ధ్రువపత్రాలు లేని 44 వాహనాలు సీజ్

### నేరాల నియంత్రణే లక్ష్యంగా విస్తృత తనిఖీలు

**మఖ్తల్, అక్టోబర్ 27 (జనంసాక్షి ) :** మక్తల్ పట్టణ కేంద్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే ధ్యేయంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు, మక్తల్ సీఐ రామ్‌లాల్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో తెల్లవారుజామున భారీ పోలీసు బలగాలతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 5గురు ఎస్సైలు, ఒక ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుళ్లు కలిపి మొత్తం 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొని కాలనీలోని ప్రతి ఇల్లు, వ్యాపార సముదాయాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల సమయంలో ఎలాంటి సరైన ధ్రువపత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 44 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. సీఐ రామ్‌లాల్ మాట్లాడుతూ పత్రాలు లేని మిగతా వాహనాలపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అసాంఘిక శక్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచేందుకే ఈ తనిఖీలు నిర్వహించామని, ప్రజలు పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాజు, నవీద్, రమేష్, మహేంద్ర రెడ్డి, రేవతి, ఏఎస్సై శంకరయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి అభినందనీయం

### టీజీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్.రవీందర్

### విద్యార్థులకు బ్యాగులు, షూస్, డిక్షనరీల అందజేత

**కోహెడ అక్టోబర్ 27: ( జనంసాక్షి ) :** విద్యాభివృద్ధికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని నాగసముద్రాల గ్రామంలోని పీఎం శ్రీ టీజీ మోడల్ స్కూల్ లో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న స్కూల్ బ్యాగులు, షూస్, డైరీలు, డిక్షనరీలను స్థానిక సర్పంచ్ పెరుక సరిత- రామచంద్రంతో కలిసి విద్యార్థుల కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాఠశాల విద్య బలోపేతానికి విద్యార్థులకు ఉచితంగా టిఫిన్, మధ్యాహ్న భోజనం తోపాటు విద్యార్థులకు అవసరమైన బ్యాగులు, షూస్ వంటి ఉపయోగకరమైన వస్తువులు అందజేయడం ఎంతో సంతోషకరమన్నారు. విద్యార్థులు అవకాశాలను వినియోగించుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం సర్పంచ్ పెరుక సరిత - రామచంద్రం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, సూపర్ ఎల్ నినో ప్రభావం ఉన్నందున నీటిని, విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఏపి చైర్మెన్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# ప్రజాబాటతో పొలంబాట పట్టిన విద్యుత్ శాఖ అధికారులు

**రాజాపూర్, అక్టోబర్ 27(జనంసాక్షి):** ప్రభుత్వం విద్యుత్ శాఖ, వినియోగదారులు, రైతులతో సమన్వయం చేసే కార్యక్రమమైన ప్రజాబాట... పొలంబాట కార్యక్రమం ప్రారంభం చేసింది. అందులో భాగంగా రాజాపూర్ మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ వినియోగ దారులతో విద్యుత్ సరఫరా గురించి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రూరల్ జోన్ సీఈ బాలాస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు గృహాలలో విద్యుత్ ను పొదుపు గా వాడాలని, అవసరమైనప్పుడు మాత్రమే ఇళ్ళలో ఫ్యాన్ లు, బల్బులు వేసుకోవాలని సూచించారు. రైతులు ఎల్ నినో ను దృష్టిలో పెట్టుకొని, ఆరుతడి పంటలు వేసుకోవాలని, సాగు నీరు ఎంత ఉంటుందో అంతే పంట వేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎస్ఈ భీమా నాయక్, జడ్చర్ల డీఈ చంద్రమౌళి,రాజాపూర్ ఏడీఈ నవీన్ కూమార్,ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీ రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

### ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు కలగాలి: పాల్వంచ అరుణ కృష్ణ గౌడ్ దంపతులు

**కొల్చారం, అక్టోబర్ 27 (జనం సాక్షి):** కొల్చారం మండల కేంద్రంలోని ఆదిశక్తి పరాశక్తి శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ పాల్వంచ అరుణ కృష్ణ గౌడ్ దంపతులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పులుగుర్త నాగరాజు శర్మ, భగవాన్ శర్మ మంత్రోచ్చారణల నడుమ పూజలు జరిపించారు. ఈ సందర్భంగా అరుణ కృష్ణ గౌడ్ దంపతులు మాట్లాడుతూ.. శ్రీ రేణుక ఎల్లమ్మను దర్శించుకుంటే భక్తులకు శుభాలు కలుగుతాయని, అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పూజల్లో పాల్గొన్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, వడ్ల ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, శివకుమార్ గౌడ్, ఆశన్నగారి అంజయ్య, కమ్మరి దశరథం, కుమ్మరి నాగయ్య, పాప గౌడ్, కృష్ణ గౌడ్ (కిట్టు), సుధాకర్ గౌడ్, సత్యనారాయణ, పాల్వంచ యాదమ్మ, రుక్మిణి, లలిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



# అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన అభిమన్యు రెడ్డి



**రాజాపూర్, అక్టోబర్ 27(జనంసాక్షీ) :** రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మేకల వెంకటయ్య (54) అనారోగ్యంతో బాధపడుతూ మరణించగా.. బిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు 5వేల రూపాయలు ఆర్థిక సహాయన్ని యువసేన సభ్యుల ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ మండల అధ్యక్షులు బంగారి వెంకటేష్, డిప్యూటీ సర్పంచ్ రామ్ చందర్, పుల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, నర్సిములు, కిషోర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయడం అభినందనీయం

### మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బోయిని నిర్మల - జయరాజు
### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి సుధాకర్ పటేల్

**కోహెడ అక్టోబర్ 27:( జనంసాక్షి ):** మండల కేంద్రంలో రైతు వేదికలో మంగళవారం రైతులకు సబ్సిడీ విత్తనాలను మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బోయిని నిర్మల - జయరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శెట్టి సుధాకర్ లు రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శెట్టి సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు సబ్సిడీ పై మొక్కజొన్న, పొద్దుతిరుగుడు విత్తనాలు అందించడం ద్వారా ఈ ప్రజా పాలన ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తూ రైతు ప్రభుత్వంగా నిలస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఆరుతడి పంటలు సాగు చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేసి రైతులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. రైతులకు రైతు రుణమాఫీ చేయడమే కాకుండా ఉచిత కరెంటు ను అందచేస్తుందని, రైతును అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రజా పాలన ప్రభుత్వం రేవంత్ రెడ్డి, స్థానిక శాసన సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారని , అలాగే వచ్చే సంవత్సరం లోపు గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గ రైతాంగానికి కాలువల ద్వారా వ్యవసాయ రంగానికి సాగు నీటిని అందచేసే దిశగా మన తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సతీష్, మండల సర్పంచ్ ల ఫోరమ్ కన్వీనర్ కరివేద చంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దూలం శ్రీనివాస్ గౌడ్, చేపూరి శ్రీశైలం వివిధ గ్రామాల సర్పంచ్ లు, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.



## అయిజ మున్సిపాలిటీలో ఉద్రిక్తత

**అయిజ, అక్టోబర్ 27( జనం సాక్షి)** ఐజ మున్సిపాలిటీలో మున్సిపల్ అధికారుల వైఖరిపై ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం వాయిదా పడటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ కమిషనర్ ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం వహిస్తూ, సమావేశాన్ని వాయిదా వేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిని,



ప్రజా సమస్యల పరిష్కారాన్ని అడ్డుకునేలా అధికారుల తీరు ఉందన్నారు. సర్వసభ్య సమావేశం ద్వారా ఎన్నో కీలకమైన వార్డు సమస్యలపై చర్చించి, నిధుల కేటాయింపులు చేయాల్సి ఉండగా,కమిషనర్ కావాలనే అలసత్వం ప్రదర్శిస్తూ సమావేశాన్ని వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. అధికారుల ఇటువంటి చర్యల వల్ల పట్టణ ప్రగతి కుంటుపడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ ప్రగతి విషయంలో అధికారులు రాజకీయాలకు తావులేకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని చైర్మన్ డిమాండ్ చేశారు. కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయడంపై కౌన్సిలర్లు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## గుండారెడ్డిపల్లిలో ఎల్‌నినో ప్రభావంపై గ్రామసభ

### నీటిని పొదుపుగా వాడుకుందాం
### భవిష్యత్తు తరాలకు నీటిని కాపాడుదాం



**కోహెడ అక్టోబర్ 27:( జనంసాక్షి ):** మండలం లోని గుండారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం సర్పంచ్ పిల్లి బాబు అధ్యక్షతన, మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలనే అంశంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ప్రాముఖ్యత, నీటి వృథాను అరికట్టడం, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, భవిష్యత్తులో నీటి కొరతను నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించడం వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గంగుల సంతోష్, దాసరి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, జీపీఓ బాలకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ భూంపెల్లి సంజీవరెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సింగిరాల కనుకయ్య, అంగన్‌వాడీ టీచర్ వంగ ఉమాదేవి, ఆశా వర్కర్లు గుజ్జు జ్యోత్స్న, గుడిపాక రేణుక, సీఏలు బుట్టి లింగం, మంగ రజిత, జడగల లక్ష్మణ్, పెంకర్ల శేఖర్, నాగిళ్ల నరసింహారెడ్డి, గడ్డం సంపత్‌తో పాటు గ్రామ ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

### అందించిన జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుజ్జపు మచ్చేందర్



**సిర్గాపూర్, అక్టోబర్ 27 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండల పరిధిలో శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామ ప్రజల కోరిక మేరకు జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుజ్జపు మచ్చేందర్ రూ.2 లక్షల విరాళాన్ని అందించారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవిస్తూ, గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధికి తన వంతు అండగా నిలవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు గుజ్జపు మచ్చేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిర్గాపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు తమ బసవరాజు పటేల్, సంజురావు పటేల్, అంజ గౌడ్, సాయిలు, కిరణ్ రావు పటేల్, డాక్టర్ కృష్ణ, పుండరికం, సంగమేష్, నామ్దేవ్, చిన్న నారాయణ సేట్, చాకలి సాయిలు, నరేష్ సేట్, హన్మండ్లు, నరేష్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న మాజీ జెడ్పీటిసి అనంతుల అశ్విని ప్రశాంత్

**కొండపాక,అక్టోబర్ 27 (జనంసాక్షి) :** కొండపాక మండలం మర్పడగా గ్రామానికి చెందిన ఎండి సయ్యద్ మరణించిన విషయం తెలుసుకొని అంత్యక్రియల కోసం స్థానిక జెడ్పీటిసి మాజీ తాజా అనంతుల అశ్విని ప్రశాంత్ మర్పడగా బి ఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకుల ద్వారాకుటుంబ సభ్యులకు 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని అనంతల ప్రశాంత్ మాట్లాడుతూ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బ్యాగులు, షూస్ పంపిణీ



**కోహెడ అక్టోబర్ 27:( జనంసాక్షి ):** ప్రభుత్వ జూనియర్ కళాశాల కోహెడ లో మంగళవారం సిద్దిపేట జిల్లా ఇంటర్ విద్యాధికారి కలకొండ రవీందర్ రెడ్డి చేతుల మీదుగా కళాశాల విద్యార్థుల కు బ్యాగులు, షూస్ పంపిణి చేశారు. కార్యక్రమంలో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన వసతులను వినియోగించుకుని కళాశాలకు రెగ్యులర్ గా హాజరై కళాశాలను వార్షిక ఫలితాలలో జిల్లా లోనే ప్రథమ స్థానం సాధించి విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి చేస్తున్నటువంటి కృషికి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు జీవితంలో ముందడుగు వేయడానికి ఇలాంటి ప్రోత్సాహకాలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కోతి యాదగిరి, వి రాజమౌళి, ఎస్ రాజేశ్వర్ రెడ్డి ,ఎస్ శ్రీనివాస్, కే. రజిత, వెంకటరెడ్డి, బి సుజాత, యమ్ నీరజ, యు శ్రీనివాస్, కే అశోక్, వి నరేష్ ,ఏ సీతారామయ్య, చిరంజీవి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులు తక్కువ నీటితో పండించే పంటలను సాగు చేయాలి

### వ్యవసాయ శాఖ అధికారి ఏవో అరవింద్



**అమరచింత (జనంసాక్షి) :** మంగళవారం నాడు చంద్రగడ్ గ్రామంలో కేజీ బచావో అభియాన్ 2026 కార్యక్రమంలో గ్రామపంచాయతీ దగ్గర రైతులతో సభ నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా రైతులుయి యాసంగి పంట సాగు చేపట్టబోయే రైతులు బోరు బావుల మీద ఆధారపడి సాగు చేసే రైతులు పంటలు తక్కువ నీటితో వేసే పండించే పంటలు జొన్న సర్జ పెసర నువ్వులు కుసుమ పొద్దు తిరుగుడు ఆముదం మొక్కజొన్న వంటి పంటలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని రైతులకు తెలియజేయడం జరిగింది. ప్రస్తుతం ఎల్ ని నో కారణంగా వాతావరణంలో మార్పుల కారణంగా విపరీతమైన వేడి పెరిగే అవకాశం ఉన్నందువలన బోర్లు బావులు నదులలో నీళ్లు తగ్గే అవకాశం ఉంది అదేవిధంగా భూగర్భ జలాలు కూడా పడిపోయే అవకాశం ఉన్నందువల్ల కూరగాయల పంటను తక్కువ నీటితో పండించే పంటలను సాగు చేయాలని గ్రామ రైతులతో చర్చించడం జరిగింది.

## నిజాంపేట్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా గొల్ల సంగమేశ్వర్ ఏకగ్రీవ ఎన్నిక

**నిజాంపేట్, అక్టోబర్ 27 (జనం సాక్షి):** నిజాంపేట్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా గొల్ల సంగమేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఆంగోత్ విజయ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల కేంద్రంలో సోమవారం జరిగిన సర్పంచుల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.



## తాగునీటి సమస్య తలెత్తకుండా
# ముందస్తు చర్యలు

న్యాల్ కల్, అక్టోబర్ 27, (జనం సాక్షి) : ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం నుండి తీవ్ర వర్షాభావం, విద్యుత్ కొరత, తదితర సమస్యలతో.. స్థానిక ప్రజానీకం త్రాగునీరు, ఇతర అవసరాల కోసం నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. మంగళవారం మండలంలోని హుసెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ రేవంత్ కుమార్ అధ్యక్షతన, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలయ్య స్వామి, ఉప సర్పంచ్, పలువురు వార్డు సభ్యులు సమావేశమై సమీక్షించారు. గ్రామంలోని దాదాపు 580 కుటుంబాలకు గాను ఈ పాటికే దాదాపు 90 శాతానికి పైగా ఉన్న నల్లాలకు ఆన్, ఆఫ్ ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. గ్రామంలోని ప్రతి కుళాయి నుండి నీరు వృధా కాకుండా కుటుంబీకులు సహకరించాలని సర్పంచ్ కోరారు. గ్రామంలోని పలు బోరు బావుల్లో పుష్కలంగా నీరు ఉందని, త్రాగునీటి సమస్య ఉత్పన్నమైతే.. బోరు బావులకు మోటార్లను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి నీటిని సరఫరా చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు.



# కాలనీలో రోడ్ల మరమ్మతులు

ఎర్రవల్లి, అక్టోబర్ 27 (జనం సాక్షి)ఎర్రవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వసంత నగర్ కాలనీలో గత కొంతకాలంగా మట్టిరోడ్లు పూర్తిగా దెబ్బతిని, పెద్ద పెద్ద గుంతలు పడటంతో స్థానిక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులు, నడిచి వెళ్లేవారు ఈ గుంతల వల్ల ప్రమాదాలకు గురవుతుండటంతో, కాలనీ ప్రజలంతా కలిసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.కాలనీ వాసుల విన్నపానికి తక్షణమే స్పందించిన ఎర్రవల్లి సర్పంచ్ అనిత కృష్ణసాగర్ సమస్య తీవ్రతను గుర్తించారు. వర్షాల వల్ల మరింత అధ్వాన్నంగా మారిన ఆ రోడ్లను పునరుద్ధరించేందుకు నేడు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సర్పంచ్ స్వయంగా పర్యవేక్షించి, కాలనీకి భారీగా మట్టిని తెప్పించారు. అనంతరం జేసీబీ యంత్రాన్ని రంగంలోకి దించి, రోడ్డుపై ఉన్న గుంతలన్నింటినీ మట్టితో నింపి, రోడ్లను చదును చేయించి ప్రయాణానికి అనుకూలంగా మార్చారు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న ఈ రహదారి సమస్యను వేగంగా పరిష్కరించడం పట్ల వసంత నగర్ కాలనీ నివాసితులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ అనిత కృష్ణసాగర్ చొరవను అభినందిస్తూ, కాలనీ వాసులు అమిన్ బాషా, శేఖర్ రెడ్డి, వినోద్ స్వామి, భాస్కర్, పరుశరామ్, మధుసూదన్ గౌడ్, మెకానిక్ రవి, ఝాడే శివ, ఈరన్న గౌడ్‌లతో పాటు పలువురు స్థానికులు గ్రామ పంచాయతీకి మరియు సర్పంచ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఏడుగుట్టల తండాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

బాలానగర్, అక్టోబర్ 27( జనం సాక్షి): బాలానగర్ మండలం ఏడుగుట్టల తండాలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ఆదేశాల మేరకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కవిత రమేష్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత రమేష్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పేదలకు ఉచిత సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, రేషన్ తదితర ప్రయోజనాలు మరింత సులభంగా అందుతాయని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ఆదేశాల మేరకు ఏడుగుట్టల తండాలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకట రామ్ నాయక్, మాజీ సర్పంచ్ హనుమ నాయక్, వార్డు సభ్యులు, తండావాసులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రఫీలో వనపర్తి యువకుడికి రజత పతకం





వనపర్తి బ్యూరో అక్టోబర్ 27 (జనంసాక్షి) : ఛాయాచిత్ర కళలో వనపర్తికి చెందిన కంచ రాజ్ కుమార్ ప్రతిభను చాటుకున్నారు. తెలంగాణ ఫోటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 2024 ద్వితీయ త్రైమాసిక ఛాయాచిత్ర పోటీల్లో రజత పతకాన్ని సాధించారు. ఏకవర్ణ వ్యక్తి చిత్రణ అంశంలో ఆయన చిత్రీకరించిన 'బాల్యం' అనే ఛాయాచిత్రానికి ఈ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌లో అక్టోబర్ 24న నిర్వహించిన కార్యక్రమంలో ఛాయాచిత్ర పుస్తకావిష్కరణ, పురస్కార ప్రదానోత్సవం, ఛాయాచిత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్ సంచాలకురాలు డాక్టర్ కె. లక్ష్మి, తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా 'కాలంలో నిక్షిప్తం -- కాకతీయ వారసత్వానికి ఛాయాచిత్ర నివాళి' అనే ఛాయాచిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఛాయాచిత్ర పోటీల్లో విజేతలకు పురస్కారాలు అందజేశారు. అక్టోబర్ 24 నుంచి 26 వరకు ఛాయాచిత్ర ప్రదర్శన నిర్వహించారు.రాజ్ కుమార్ సాధించిన విజయంపై ఆయన ఛాయాచిత్ర కళా గురువు, నవీన ఫోటో స్టూడియో యజమాని ఎస్వీ రమేష్ హర్షం వ్యక్తం చేశారు. తన వద్ద శిక్షణ పొందిన రాజ్ కుమార్ క్రమశిక్షణ, పట్టుదలతో అంచెలంచెలుగా ఎదిగి రజత పతకం సాధించడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు సాధించి ఛాయాచిత్ర కళారంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఎస్వీ రమేష్ సైతం ఛాయాచిత్ర కళారంగంలో పలు జాతీయ స్థాయి పురస్కారాలను అందుకున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో రాజ్ కుమార్ ఈ ఘనత సాధించడం వనపర్తికి గర్వకారణంగా నిలిచింది.













# లక్ష్మీనృసింహస్వామి హుండీ రూ.1,69,382



శివ్వంపేట, అక్టోబర్ 27 జనంసాక్షి : మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామ శివారులో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపును మంగళవారం దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు, పోలీస్ శాఖ, గ్రామ సర్పంచ్, భక్తుల సమక్షంలో శ్రీ లలిత సేవా సంఘం సభ్యులు హుండీ లెక్కించగా, గత ఐదు నెలలకు సంబంధించి మొత్తం హుండీ రూ. 1,69,382 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డివిజన్ పరిశీలకులు రంగారావు, సర్పంచ్ అరుణరెడ్డి, ఉప సర్పంచ్ ఏనుగు ప్రభాకర్ రెడ్డి, నర్సింలు, పోలీస్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# పంపిణీకి సిద్ధంగా శనగ, తెల్ల కుసుమ విత్తనాలు

## మండల ఏఈఓ అభినాష్ వర్మ



న్యాల్ కల్, అక్టోబర్ 27, (జనం సాక్షి) : రబీ సాగు నేపథ్యంలో.. రైతులకు రాయితీపై పంపిణీ చేసేందుకు శనగ, తెల్ల కుసుమ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, ఈ నెల 28, బుధవారం నుండి అర్హులైన రైతులకు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండల రైతాంగానికి పంపిణీ చేసేందుకు రెండవ విడతలో 25 కేజీల బస్తా గల శనగ విత్తనాలు.. 400 బస్తాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. న్యాల్ కల్ లోని రైతు వేదికలో 250 శనగ బస్తాలు, 200 తెల్ల కుసుమ విత్తనాల బస్తాలు, స్థానిక డీసీఎంఎస్ ఎరువులు, విత్తనాల పంపిణీ కేంద్రంలో..150 శనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 25 కేజీల శనగ విత్తనాల ధర రూ:1550, 4 కేజీల బరువు గల తెల్ల కుసుమ విత్తనాలను రూ:200 చొప్పున రైతులకు అందజేయనున్నారు. పక్షం రోజుల క్రితం మొదటి విడతలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు 350 బస్తాల శనగ విత్తనాలను పంపిణీ చేశారు. అర్హులైన రైతులు సద్వినిగం చేసుకోవాలని ఏవో సూచించారు.

## అక్కేనపల్లి, గట్లమల్యాల గ్రామాల్లో బిఆర్ఎస్వి కమిటీల నియామకం

**నంగునూరు, అక్టోబర్ 27 (జనంసాక్షి):** సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆదేశాల మేరకు నంగునూరు మండలంలోని అక్కేనపల్లి, గట్లమల్యాల గ్రామాల్లో బిఆర్ఎస్వి నూతన కమిటీలను మంగళవారం నియమించారు. బిఆర్ఎస్వి మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఒక్కో గ్రామానికి 15 మంది సభ్యులతో కూడిన కమిటీలను ప్రకటించారు. అక్కేనపల్లి గ్రామ అధ్యక్షుడిగా అప్పిస శ్రీకాంత్, గట్లమల్యాల గ్రామ అధ్యక్షుడిగా రంగు వినయ్ కుమార్ నియామకమయ్యారు.



**ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...** కాంగ్రెస్



ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. విద్యా శాఖ మంత్రిని నియమించకపోవడం, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో కనీస వసతులు, సరైన భోజనం కల్పించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై విద్యార్థులు, నిరుద్యోగులతో కలసి బిఆర్ఎస్వి పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

- **తాగు, సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలి**
- **నంగునూరు మండల ప్రత్యేకాధికారిణి శివరంజని**



**నంగునూరు, అక్టోబర్ 27 (జనంసాక్షి):** ఎల్‌నీనో ప్రభావం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో సాగు, తాగునీటిని ప్రజలు అత్యంత పొదుపుగా వాడుకోవాలని నంగునూరు మండల ప్రత్యేకాధికారిణి శివరంజని పిలుపునిచ్చారు. గ్రామాల్లో సర్పంచులు ఎల్.నీనో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని సూచించారు.

సిద్దిపేట జిల్లా నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్ అధ్యక్షతన మండల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని నివేదికలను చదివి వినిపించారు. ఎల్.నీనో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగు చేయవద్దని, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని వ్యవసాయాధికారి గీత సూచించారు.

మండలంలో ప్రస్తుతం భూ సర్వే, రీ-సర్వే పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని రెవెన్యూ ఇన్ స్పెక్టర్ లింగం తెలిపారు. మరోవైపు రాబోయే మార్చి, ఏప్రిల్ నెలల్లో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని పశు వైద్యాధికారి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. పశువైద్యశాలలో సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అలాగే ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రతి గురువారం ఎన్సీడీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని డాక్టర్ ఉదయ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందించే యూనిఫాంల రెండో జత పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈఓ దేశిరెడ్డి వెల్లడించారు.

ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్లు కోల రమేష్ గౌడ్, ఎల్లంకి మైపాల్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంతోష్ రెడ్డిలతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పాఠశాల స్థాయి నుంచే

## అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

- **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ రంగనాయకులు**



**కొత్తపల్లి అక్టోబర్ 27 (జనంసాక్షి):** ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే నిజాయితీ, నైతిక విలువలను అలవర్చుకొని అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ లింగాలచేడ్ డిప్యూటీ మేనేజర్ రంగనాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తపల్లి మండలం నిడ్జింత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవినీతి నిరోధక చైతన్య వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ.. అవినీతి రహిత భారతదేశం తన స్వప్నమని, నిజాయితీ ఇంటి నుంచే, పాఠశాల నుంచే ప్రారంభం కావాలని పేర్కొన్నారు. అవినీతి రహిత భారతదేశం, విద్యార్థి జీవితంలో సత్యం-నిజాయితీ ప్రాముఖ్యత, డిజిటల్ నైతికత, బాధ్యతాయుతమైన ఇంటర్నెట్ వినియోగం, ఉత్తమ పౌరుల నిర్మాణంలో విలువలతో కూడిన విద్య వంటి అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, ప్రతి ఒక్కరూ నిజాయితీని జీవితంలో భాగంగా చేసుకోవాలని రంగనాయకులు సూచించారు. ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ, ఉపాధ్యాయులు బోధించిన నైతిక విలువలను ఆచరణలో పెట్టాలని అన్నారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదిగి, గ్రామాభివృద్ధితో పాటు దేశ పురోగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు విజయ్, ఉపాధ్యాయులు సుజాత, దేవేంద్రప్ప, నగేష్, రామకృష్ణ, హనుమంతు, వరలక్ష్మి, రాఘవేందర్‌తో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే ఆన్ వీల్స్

- **టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్,మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ**
- **రేగులపల్లి, చిలాపూర్‌లో ప్రజల సమస్యలపై అధికరణతో సమీక్ష**



**బెజ్జంకి,అక్టోబర్ 27(జనంసాక్షి):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మానకొండూరు ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా బెజ్జంకి మండలంలోని రేగులపల్లి, చిల్లాపూర్ గ్రామాల్లో మంగళవారం పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఇందిరమ్మ ఇళ్ల పురోగతి,ప్రభుత్వ



సంక్షేమ పథకాల అమలు, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో రెవెన్యూ,మండల ప్రజాపరిషత్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ, గృహ నిర్మాణ, గ్రామీణ నీటి సరఫరా, శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని,వాటికి సత్వర పరిష్కారం చూపించడమే ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అనీ అన్నారు.ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలి అనీ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి అనీ అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్,ఏఎంసీ చైర్మన్ శిరీష అనిల్,వైస్ చైర్మన్ పర్శ సంతోష్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు,మాజీ ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ,రేగులపల్లి సర్పంచ్ జంగిలి లక్ష్మితిరుపతి,చిల్లాపూర్ సర్పంచ్ శానగొండ స్వరూప భాస్కరాచారి,వివిధ గ్రామాల కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు, మండల నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

## పేట జిల్లాలో ఘనంగా పీఎం శ్రీ జిల్లాస్థాయి కళా,సాంస్కృతిక పోటీలు



**నారాయణపేట అక్టోబర్ 27(జనంసాక్షి):** నారాయణ పేట జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి కళా, సాంస్కృతిక పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు నృత్యం, సంగీతం, వాయిద్య సంగీతం, కళలు, హస్తకళల విభాగాల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఎం. గోవిందరాజ, అకడమిక్ మానిటరింగ్ అధికారి విద్యా సాగర్ హాజరై విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా డీఈఓ ఎం.గోవిందరాజు మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇటు వంటి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యాసాగర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి నిరంతరం సాధన చేస్తే ఉన్నత విజయాలు సాధించవచ్చని తెలిపారు.

గేలుపు కృషికి గుర్తింపు కాగా, నిరంతర సాధన విజయానికి పునాది అని పేర్కొంటూ విద్యార్థులు తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. పోటీల విజేతల వివరాలు.. నృత్యంలో ప్రథమ బహుమతి శివాని బృందం - పీఎం శ్రీ దామర్‌గిద్ద ద్వితీయ బహుమతి చంద్రరేఖ ధన్వాడ సంగీతం ప్రథమ బహుమతి జానకి పీఎం శ్రీ, పెద్దకడ్మూర్ ,ద్వితీయ బహుమతి నిఖిత - పీఎం శ్రీ, పాతర్‌చేడ్ ,వాయిద్య సంగీతం,ప్రథమ బహుమతి శివాని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గ్రౌండ్, నారాయణపేట, కళలు/హస్తకళలు ప్రథమ బహుమతి నవ్య ఊట్కూర్,ద్వితీయ బహుమతి వినయ్‌కుమార్ ధన్వాడ గెలుచుకున్నారు. కార్యక్రమ నిర్వహణలో భాగస్వాము లుపోటీల నిర్వహణలో కనకప్ప,నర్సప్ప,సంగ నర్సింహులు, జ్ఞానేశ్వరి, నబాలకేంద్రం తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, సమన్వ యకర్తలు, పాఠశాలల అధికారులు అభినందించారు.

## పట్టభద్రుల ఎన్నికలపై బీజేపీ నేతల సమాలోచన

- **తెలకపల్లిలో పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశం**
- **ఎన్నికల కార్యాచరణపై చర్చ.. పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం**



**తెలకపల్లి, అక్టోబర్ 27 (జనంసాక్షి):** రానున్న పట్టభద్రుల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీజేపీ శ్రేణులు ఎన్నికల సన్నాహాలను ముమ్మరం చేస్తున్నాయి. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని యోగ భవనంలో బీజేపీ మండల అధ్యక్షుడు మంద చిన్నారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు నరేంద్ర రావు హాజరై మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు సంబంధించి పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, అనుసరించాల్సిన వ్యూహాలు, పట్టభద్రుల ఓటర్లను కలిసే అంశాలపై నాయకులు చర్చించారు. ఎన్నికల సమయంలో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఓటర్లను కలిసి పార్టీ అభ్యర్థి విజయానికి అవసరమైన కార్యాచరణను చేపట్టాలని నాయకులు సూచించారు. పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతు కూడగట్టేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఓటర్లకు పార్టీ విధానాలు, అభ్యర్థి తరఫున చేపడుతున్న కార్యక్రమాలను వివరించి, ఎన్నికలకు సంబంధించి విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని చర్చించారు. ఎన్నికల ప్రక్రియలో పార్టీ శ్రేణుల భాగస్వామ్యం కీలకమని పేర్కొంటూ, సమష్టి కృషితో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్, జిల్లా కార్యదర్శి చంద్రకళ బీజేపీ మండల నాయకులు బాబు సాగర్, మండల ప్రధాన కార్యదర్శి, రాజు, ఈర్లపల్లి శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు నరేంద్రచారి, కృష్ణయ్య, భాను, రమేష్ పాల్గొన్నారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

- పోలీసు ఫ్లాగ్ డేలో భాగంగా రక్తదాన శిబిరం
- విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు
- అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి):** పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ పోలీసు ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా సాయుధ పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం రక్తదాన శిబిరం, బహిరంగ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమాల్లో మొత్తం 32 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి తెలిపారు.

**ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...** విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుంచి 31 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరంలో పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు పట్టణ యువకులు, వివిధ సంఘాల ప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని, మనం ఇచ్చే రక్తం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్నారు.



విద్యార్థులకు పోలీసు విధులపై అవగాహన....

బహిరంగ ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు పోలీసు శాఖ విధులు, బాధ్యతలను వివరించారు. సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళల భద్రతలో షీ బృందాల పాత్ర, బాంబు, శునక దళాల పనితీరు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలపై వేధింపులు జరిగినప్పుడు జిల్లా షీ



బృందం నంబరు 8712656772కు సమాచారం అందించాలని, మహిళలు షీ-సేఫ్ దరఖాస్తును వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు. విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, వాటి నిర్మూలనలో పోలీసు శాఖకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోనూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పోలీసు శాఖ పనితీరుపై అవగాహన కల్పిస్తున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, డీసీఆర్బీ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు వైద్యాధికారి డాక్టర్ జ్యోతి, రక్తనిధి సిబ్బంది, పట్టణ యువకులు తదితరులు పాల్గొన్నారు.



## చెరుకు రైతులసమస్యలు పరిష్కరించాలి - కృష్ణవేణి చెరుకు రైతు సంఘం వినతి

**ఆత్మకూర్ ,అక్టోబర్ 27 (జనంసాక్షి):** చెరుకు రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రాలు అందజేశారు.ఈ మేరకు ముఖ్యమంత్రి ఓఎస్డీకి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఓఎస్డీకి, కేన్ కమిషనర్ నర్సిరెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టన్ను చెరుకుకు రూ.1000 బోనస్ ను, వరి రైతులకు ఇవ్వాలని అన్నారు, చెరుకు రైతుల పాలిట శాపంగా మారిన లోపభూయిష్ట రికవరీ విధానాన్ని రద్దు చేసి, టన్ను చెరుకుకు రూ.6000 గిట్టుబాటు ధర ఇవ్వాలి, డ్రిప్ చెరుకు రైతులకు సబ్సిడీ కింద డ్రిప్ ల్యాటర్లను రెండు సంవత్సరాలకు ఒకసారి కోరారు, చెరుకు కోతలకు లేబర్ సమస్య తీవ్రంగా ఉన్నందున మెకానికల్ హార్వెస్టింగ్ యంత్రాలను సబ్సిడీ కింద రైతులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు రాజన్న, ఉపాధ్యక్షులు వాసారెడ్డి సంజీవరెడ్డి, ఆంజనేయులు, కోశాధికారి చంద్రసేనారెడ్డి, ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు బి.రాజు, రవీందర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఎం.శ్రీను, శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు
- అమిన బీ, దీపిక



**నర్వాపూర్ అక్టోబర్ 27 (జనంసాక్షి):** మండలంలోని ఎరువుల దుకాణాలను జిల్లా అంతర్గత స్క్వాడ్ ఆధ్వర్యంలో సహాయ వ్యవసాయ సంచాలకులు అమీనా బీ, మండల వ్యవసాయ అధికారిణి దీపిక తనిఖీ చేశారు. మంగళవారం నాడు పలు దుకాణాల్లోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల విక్రయదారులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని, నాణ్యమైన ఎరువులను మాత్రమే రైతులకు విక్రయించాలని అధికారులు సూచించారు. స్టాక్ రిజిస్టర్లను రోజువారీగా నవీకరించాలని, ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖకు అవసరమైన నివేదికలు సమర్పించాలని డీలర్లను ఆదేశించారు.ఎరువుల విక్రయాల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే సంబంధిత డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎల్‌డీఎం సురేష్ ఆత్రేయ



**నారాయణపేట, అక్టోబర్ 27(జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఆర్థిక సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) సురేష్ ఆత్రేయ సూచించారు. మంగళవారం నారాయణపేట మండలం అప్పకపల్లి గ్రామంలో సీఎఫ్ఎల్ ఊట్కూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ సంతృప్తి శిబిరంలో ఆయన మాట్లాడారు. బ్యాంకింగ్ సేవలను ప్రతి ఒక్కరికీ చేరువ చేయ డంతో పాటు, అర్హులైన వారు బీమా, పెన్షన్ పథకాల్లో చేరి ఆర్థిక భద్రత పొందాలన్నారు. ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన ద్వారా బ్యాంకింగ్ సేవలు పొందవచ్చని, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల ద్వారా బీమా రక్షణ పొందవచ్చని వివరించారు. అటల్ పెన్షన్ యోజనలో అర్హతకు అనుగుణంగా చేరి వృద్ధాప్యంలో పెన్షన్ ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.బ్యాంకు ఖాతాలకు నామినీ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, వివరాల్లో మార్పులు ఉంటే అప్‌డేట్ చేయాలని సూచించారు. ఆధార్ సీడింగ్, రీ--కేవైసీ ప్రక్రియలను పూర్తి చేసుకోవడం ద్వారా బ్యాంకింగ్ సేవలకు సంబంధించిన ఇబ్బందులను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ, ఏటీఎం పిన్, బ్యాంకు ఖాతా వివరాలను వెల్లడించవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. ఆర్థిక లావాదేవీల విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులందరూ పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, జాజాపూర్ బ్యాంకు మేనేజర్ వెంకట శివ, గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొడిపల్లిలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం

- పంటల వైవిధ్యీకరణ, భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన

**కొడిపల్లి, అక్టోబర్ 27 (జనంసాక్షి):** కొడిపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, భూసార పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, పంట అవశేషాల నిర్వహణపై వ్యవసాయ నిపుణులు అవగాహన కల్పించారు.

**ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త రవి, మాట్లాడుతూ..** రైతులు వరి పంటపై ఆధారపడటాన్ని తగ్గించి, భూసారం, నీటి లభ్యత, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా వ్యవసాయ ఆదాయాన్ని పెంచుకోవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి వనరులను పరిరక్షించే విధంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని శాస్త్రవేత్త సూచించారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని, నేలలోని పోషకాల స్థాయిని బట్టి సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వినియోగించాలని తెలిపారు. దీనివల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. వరి కోత అనంతరం పొలాల్లో మిగిలిన గడ్డిని తగులబెట్టకుండా నేల



లో కలియదున్నడం లేదా ఇతర శాస్త్రీయ పద్ధతుల ద్వారా వినియోగించుకోవాలని సూచించారు. పంట గడ్డిని తగులబెట్టడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు దెబ్బతినడంతో పాటు వాయు కాలుష్యం పెరుగుతుందని వివరించారు. పర్యావరణ పరిరక్షణకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొడిపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) పుణ్యవతి, మండల వ్యవసాయ అధికారి స్వప్న, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ) సాహితి, గ్రామ సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, ఉపసర్పంచ్ శ్వేత గౌడ్,తో పాటు వార్డు సభ్యులు మంగల్పరి సందీప్ కుమార్,చల్ల బొంతమ్మ సంగప్ప, యాదమ్మ శేఖర్, లక్ష్మి శరత్, ప్రశాంత్, రమేష్ నాయక్, రైతులు పాల్గొన్నారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను పాటించి స్థిరమైన దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించాలని ఈ కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు.

## ఊర్కొండ జనరల్ బాడీ మీటింగ్‌లో గందరగోళం...

- నేలమీద కూర్చొని 5 మంది ఏ సర్పంచుల నిరసన



**ఊర్కొండ, అక్టోబర్ 27(జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల రైతు వేదికలో మంగళవారం ఎంపీడీఓ, ఎమ్మార్వో, స్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బాడీ మీటింగ్‌లో గందరగోళం నెలకొంది. కేవలం ఒక రోజు ముందే వాట్సాప్ లో సమాచారం ఇవ్వడంపై సర్పంచులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బొమ్మరాజుపల్లి, రాంరెడ్డిపల్లి, మాదారం, ఊర్కొండ, జకినాలపల్లి గ్రామాల సర్పంచులు తమకు తెలియకుండానే నిధుల కేటాయింపులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని ఎంపీడీఓ, స్పెషల్ ఆఫీసర్‌ను వేదికపైనే నిలదీశారు. దీంతో సమావేశంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. సర్పంచ్‌లు నేలపై బైఠాయించి నిరసన తెలియజేశారు. సర్పంచులకు బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో మద్దతు పలికారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండల పర్యటనలు ప్రతి గ్రామ పంచాయతీకి 50 లక్షల నిధులు కేటాయించడం జరిగిందని, మా తీర్మానం అనుమతి లేకుండా నిధులు కేటాయిస్తున్నారని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో సర్పంచులను సంప్రదించకుండా అధికార పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ప్రాధాన్యమిస్తున్నారని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి సర్పంచుల అభిప్రాయాలు తెలియజేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కదిరే శేఖర్ యాదవ్, మంజుల శ్రీనివాసులు, తిరుపతమ్మ, మల్లేష్, ఒర్సు శివ లీలా ఆంజనేయులు తదితరులు బీజేపీ , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అలా సీజ్... ఇలా రీ ఓపెన్

**పుల్కల్, అక్టోబర్ 27 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలో అనుమతులు లేకుండా, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 'మన ఊరి రుచులు' హోటల్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు సోమవారం సాయంత్రం సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన గంట వ్యవధిలోనే హోటల్‌ను తిరిగి తెరిచి కార్యకలాపాలు కొనసాగించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

అధికారులు సీజ్ చేసిన హోటల్ ఇంత తక్కువ సమయంలోనే ఎలా రీ ఓపెన్ అయిందనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. నిబంధనలను ఉల్లంఘించిన హోటల్‌పై చర్యలు తీసుకున్న అధికారులు, అనంతరం తిరిగి తెరవడానికి ఎలా అనుమతించారో స్పష్టం చేయాలని పలువురు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, హోటల్ యాజమాన్యంతో అధికారులు కుమ్మక్కయ్యారా.. అనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

# కస్తూర్బా పాఠశాలలో 40 ట్రంకు పెట్టెలు,10 రేకు సీట్లు స్క్రాప్‌కు

- **ప్రత్యేక అధికారి ఇందిరపై ఆరోపణలు..**
- **ఎంఈఓ సమాధానంపై అనుమానాలు**

**పుల్కల్, అక్టోబర్ 27 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రభుత్వ సామగ్రి స్క్రాప్‌కు తరలించారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. పాఠశాలలోని 40 ట్రంకు పెట్టెలు,10 రేకు సీట్లు స్క్రాప్ దుకాణానికి విక్రయించినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో పాఠశాల ప్రత్యేక అధికారి ఇందిర పాత్రపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలకు చెందిన సామగ్రిని విక్రయించేందుకు సంబంధిత అధికారుల అనుమతి తీసుకున్నారా.. అనుమతి లేకుండా 40 ట్రంకు పెట్టెలు,10 రేకు సీట్లను ఎలా తరలించారు... వాటిని ఎంత మొత్తానికి విక్రయించారు. వచ్చిన నగదును పాఠశాల ఖాతాలో జమ చేశారా... అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.





**ఎంఈఓ సమాధానంపై పలు అనుమానాలు...**

ఈ విషయంపై ఎంఈఓ శంకర్‌ను వివరణ కోరగా, ఎలాంటి పర్మిషన్ లేకున్నా ట్రంకు పెట్టెలను విక్రయించవచ్చని సమాధానం ఇస్తూ విషయాన్ని దాటవేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ప్రభుత్వ పాఠశాల సామగ్రి విక్రయానికి సంబంధించి నిబంధనలు ఏమిటన్న దానిపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. 40 ట్రంకు పెట్టెలు,10 రేకు సీట్లు ఎక్కడికి తరలించారు..ఎవరి అనుమతితో విక్రయించారు... ఎంత మొత్తానికి విక్రయించారు, అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల స్టాక్ రిజిస్టర్,ఇతర రికార్డులను పరిశీలించి,ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఎల్నినోని సమర్థవంతంగా ఎదుర్కోవాలి



**తూప్రాన్, అక్టోబర్ 27(జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావాన్ని ప్రజలు సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఎంపీవో శ్రీనివాస్ రెడ్డి సూచించారు. దండుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మరాఠి నాగరాజు అధ్యక్షతన ఎల్నినో ప్రభావంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవాలని ప్రజలకు సూచించారు. వాతావరణ మార్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు, కార్యదర్శి, ఆయా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం

# రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పి.ఆనంద్ కుమార్ ఎన్నిక

- **ప్రజ్ఞాపూర్‌లో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం**

**మెదక్ బ్యూరో, అక్టోబర్ 27(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మెదక్ జిల్లా అధ్యక్షుడు పి.ఆనంద్ కుమార్ ఎన్నికయ్యారు. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లో మంగళవారం నిర్వహించిన సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. రేషన్ డీలర్ల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ, సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర



ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజుకు, సంఘం నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పి.ఆనంద్ కుమార్ ఎన్నిక కావడం పట్ల మెదక్ జిల్లా రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు.

## మండల ఎంఆర్‌సీలో

# కొమురం భీం 86వ వర్ధంతి



**అడ్డాకుల, అక్టోబర్ 27 (జనంసాక్షి):** మండల వనరుల కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు కొమురం భీం 86వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ వి.ప్రకాష్ హాజరై కొమురం భీం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ఈ సందర్భంగా ఎంఈఓ వి.ప్రకాష్ మాట్లాడుతూ..** కొమురం భీం తన జీవితాంతం ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఎస్ ప్రధానోపాధ్యాయులు రాములు, బిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలశంకర్, రమేష్ గౌడ్, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

## గుండాల నూతన

# ఉప సర్పంచ్‌కు ఘన సన్మానం



**వెల్దండ, అక్టోబర్ 27 (జనంసాక్షి):** వెల్దండ మండలం గుండాల గ్రామంలో నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్ పేరుమల్ల మనీషా సైదులును ఘనంగా సన్మానించారు. గతంలో ఉప సర్పంచ్‌గా విధులు నిర్వహించిన కొమ్ము లింగం ఇటీవల మరణించడంతో నూతన ఉప సర్పంచ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ జక్కుల శిరీష వెంకటయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని నూతన ఉప సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.

# పాడి పశువుల ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ వహించాలి

- **ఉచిత సంతానోత్పత్తి పరీక్షలు, నట్టల నివారణ కార్యక్రమం**
- **పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్**



**ఉప్పునుంతల (జనంసాక్షి):** పశువుల ఆరోగ్య పరిరక్షణ, పాల ఉత్పత్తి పెంపు, పశువుల సంతానోత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అయ్యవారిపల్లి గ్రామంలో ఉచిత సంతానోత్పత్తి వైద్య శిబిరం, నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ జగత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి పాడి పశువుకు ఖనిజ లవణాల మిశ్రమాన్ని తప్పనిసరిగా అందించాలని సూచించారు. పశువులకు అవసరమైన పోషకాలు అందించడం ద్వారా వాటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పాల ఉత్పత్తిని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు.

**దూడలకు నట్టల నివారణ మందులు తప్పనిసరి...**

దూడలు పుట్టిన వారం రోజుల్లోపే మొదటిసారిగా నట్టల నివారణ మందులు వేయించాలని డాక్టర్ ప్రవీణ్ సూచించారు. అనంతరం ఆరు నెలల వయస్సు వచ్చే వరకు నెలకు ఒకసారి పశువైద్యుల సూచనల మేరకు నట్టల నివారణ మందులు అందించాలని తెలిపారు.

**పశువుల షెడ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం...**

ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పశుపోషకులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. జాబ్ కార్డు కలిగిన పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారులు సంబంధిత నిబంధనలకు అనుగుణంగా వీబీజీ రామ్‌జీ పథకం కింద పశువుల షెడ్లు, గొర్రెలు, మేకల షెడ్లు, పందుల షెడ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం పొందే అవకాశాన్ని వివరించారు.

**పశుపోషణకు తక్కువ వడ్డీకే రుణాలు...**

పంట రుణాల మాదిరిగానే కిసాన్ క్రెడిట్ కార్డు పథకం ద్వారా పశుపోషణకు అవసరమైన ఖర్చుల కోసం బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు పొందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పశుపోషకులు ఈ సదుపాయాలను వినియోగించుకుని తమ జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ రంజిత్, సిబ్బంది, గోపాలమిత్ర పర్యవేక్షకుడు మురళీధర్, ముజీబ్, అంజయ్య, తిరుపతయ్య, శ్రీను, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నేడు మాజీ ఎమ్మెల్యే

# కొప్పుల మహేష్‌రెడ్డి మండలానికి రాక

- **రూ.2 కోట్ల బీటీరోడ్డు పనుల నాణ్యతపై క్షేత్రస్థాయి పరిశీలన**
- **పార్టీ శ్రేణులు,నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలి..**
- **బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దిండికాడి గోపాల్,పిలుపు**

**మహమ్మదాబాద్,అక్టోబర్ 27 (జనంసాక్షి):** మండల పరిధిలోని నంచర్ల గ్రామం నుండి చౌదర్‌పల్లి వరకు సుమారు రూ. 2కోట్ల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డు పనుల నాణ్యతపై నెలకొన్న అనుమానాల నేపథ్యంలో పరిగి మాజీ ఎమ్మెల్యే,బీఆర్ఎస్ నాయకుడు కొప్పుల మహేష్‌రెడ్డి బుధవారం నంచర్ల గ్రామానికి రానున్నారు. ఈసందర్భంగా రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనులు చేపట్టిన తీరును సమీక్షించనున్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. నంచర్ల నుండి చౌదర్‌పల్లి వరకు నిర్మించిన బీటీ రోడ్డు పనుల నాణ్యతపై ప్రజల్లో వ్యక్తమవుతున్న సందేహాలను పరిశీలించేందుకే,మాజీ ఎమ్మెల్యే పర్యటన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మహమ్మదాబాద్ మండలంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,నాయకులు,పార్టీ అభిమానులు,నంచర్ల గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై పర్యటనను విజయవంతం చేయాలని గోపాల్ కోరారు.

# భక్తిశ్రద్ధలతో హనుమాన్ దీక్ష కొనసాగించాలి



**తెలకపల్లి, అక్టోబర్ 27(జనంసాక్షి):** మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి సన్నిధిలో పీఠాధిపతి కేతావత్ జయరాం గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్న 41 రోజుల హనుమాన్ మాలాధారణ దీక్ష గోడపత్రికలను మంగళవారం తెలకపల్లి వివేకానంద చౌరస్తాలో ఆవిష్కరించారు. దీక్షా కాలంలో స్వాములు నియమ నిష్ఠలు, క్రమశిక్షణ, సహనం, సేవాభావంతో భక్తిశ్రద్ధలు పాటించాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో సురేందర్ గౌడ్, బతికే స్వామి, మొగిలి నిరంజన్, భాషామోని రమేష్, కార్తీక్, భాను, రఘు, యాదయ్య, ఎల్లస్వామి, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త డంపింగ్ యార్డ్‌తో కాలుష్యం...



- తరచూ నిప్పు పెట్టడంతో కమ్ముకుంటున్న పొగ
- వ్యాధుల బారిన జనం, రైతులకు తీవ్ర నష్టం
- జయప్రకాష్ నగర్‌లో డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తొలగించాలి
- వార్డు ప్రజల, రైతుల డిమాండ్
- మున్సిపల్ అధికారుల తీరుపై ప్రజలు, రైతుల ఆగ్రహం

**జడ్చర్ల, అక్టోబర్ 27 (జనంసాక్షి):** జడ్చర్ల పురపాలక సంఘం పరిధిలోని 9వ వార్డు జయప్రకాష్ నగర్ కాలనీ సమీపంలోని చెత్త డంపింగ్ యార్డ్ వల్ల స్థానిక ప్రజలు, సమీప రైతులు తీవ్ర నష్టాలు, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పట్టణ చెత్తను కాలనీ పక్కనే నిల్వ చేస్తుండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. డంపింగ్ యార్డ్‌లోని చెత్తకు తరచూ నిప్పు పెడుతుండటంతో వెలువడుతున్న దట్టమైన పొగ వల్ల కాలనీవాసులు, చిన్న పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధులు, కంటి మంటలు, చర్మ సమస్యల బారిన పడుతున్నారు. డంపింగ్ యార్డ్ కారణంగా చుట్టుపక్కల వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త నుంచి వెలువడే రసాయన వ్యర్థాలు, కలుషిత నీరు సాగుభూముల్లోకి చేరి నేలసారం తగ్గి, పంట దిగుబడి పడిపోతోంది. ఈదురు గాలులకు ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు పంట పొలాల్లో పడుతుండటంతో వాటిని తిని పశువులు రోగాల బారిన పడి మృతి చెందుతున్నాయి. ఈ సమస్యపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలు అందించినా కనీస చర్యలు లేవని స్థానికులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జయప్రకాష్ నగర్ కాలనీ వద్ద ఉన్న చెత్త డంపింగ్ యార్డ్‌ను జనావాసాలు, వ్యవసాయ భూములకు



దూరంగా తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.



## జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

- కబడ్డీ అధ్యక్షుడు నాగేశ్వరెడ్డి

**నారాయణపేట, అక్టోబర్ 27(జనంసాక్షి):** క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి కోరారు.ఖమ్మం జిల్లా సత్తుపల్లి లో ఈనెల 28, 29, 30 ,31 తేదీలలో నిర్వహించనున తెలంగాణ రాష్ట్రస్థాయి 73వ సీనియర్ మహిళా కబడ్డి టోర్నమెంటకు నారాయణపేట జిల్లా మహిళా జట్టు బయలు దేరినట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నారం వెంకట ప్ప తెలియజేశారు. ఈసం దర్భంగా జిల్లా కబడ్డీ అధ్యక్షులు నాగేశ్వరెడ్డి మాట్లాడుతూ క్రీడకరినీలు క్రమశిక్షణతో ఆడి నారాయణపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కార్తీక్ కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు సాయినాథ్ జిల్లా వ్యాయా మ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి బాలరాజు, సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి కోచ్ అనిత వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడా కారులు పాల్గొన్నారు.

## మొట్లంపల్లిలో కాలువ పూడికతీత పనుల పరిశీలన



**ఆత్మకూర్, అక్టోబర్ 27 (జనంసాక్షి):** ఆత్మకూర్ మండలం మొట్లంపల్లి సమీపంలో కాలువ పూడికతీత పనులను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి మంగళవారం పరిశీలించారు. మక్తల్ నియోజకవర్గ వ్యాప్తంగా భీమా కెనాల్ పూడికతీత పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మొట్లంపల్లి నుంచి ఆరేపల్లి వైపు వ్యవసాయ పంట పొలాలకు సాగునీరు అందించే కాలువలో పూడికతీత పనులను ఆయన ప్రారంభించిన అనంతరం పరిశీలించారు.

**ఈ సందర్భంగా వాకిటి శేషగిరి మాట్లాడుతూ..** నియోజకవర్గంలో దాదాపు అన్ని మండలాల్లో కాలువల పూడికతీత పనులు యజ్ఞంలా కొనసాగుతున్నాయని, గతంలో పూడికతీత లేక కాలువలు నిర్జీవంగా మారాయని, తిరిగి కాలువలకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జీవం పోస్తున్నారని అన్నారు. మంత్రి స్వయంగా రైతు అని, రైతుల కష్టాలపై ఆయనకు పూర్తి అవగాహన ఉందని, పూడిక ఉండటంతో పూర్తి స్థాయిలో సాగునీరు అందించలేక పోవడంతో పూడికతీత పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కావలి రాజేందర్, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్దశంకరంపేట మండలంలో కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

- అనుమతులు లేకుండా కల్లు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు: ఎక్సైజ్ శాఖ





**పెద్ద శంకరంపేట, అక్టోబర్ 27 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేట.మెదక్ డిప్యూటీ కమిషనర్ (ఎక్సైజ్) ఏ. చంద్రయ్య, డీపీఈఓ ఎల్. నర్సింహారెడ్డి ఆదేశాల మేరకు మెదక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు పెద్దశంకరంపేట మండలంలో కల్లు దుకాణాలపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. వివిధ గ్రామాల్లో కల్లు దుకాణాలను తనిఖీ చేస్తూ నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపిస్తున్నారు. అను మతులు లేకుండా దుకాణాలు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

సెప్టెంబర్ 9న బూరుగుపల్లి, విరోజిపల్లి గ్రామాల్లోని కల్లు దుకాణాల నుంచి నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. అలాగే లక్ష్మణపూర్ ప్రాంతంలోని టీసీఎస్ యూనిట్‌లో కల్లు నమూనాలను సేకరించినట్లు అధికారులు తెలిపారు.

అక్టోబర్ 13న శీతారాంపల్లి గ్రామంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రెండు కల్లు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సుమారు 160 లీటర్ల కల్లును ధ్వంసం చేసి, ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అక్కడి నుంచి కూడా నమూనాలను సేకరించారు.

అక్టోబర్ 26న శివ్వాయిపల్లి, తిరుమలాపూర్, శంకరంపేట గ్రామాల్లోని కల్లు దుకాణాల నుంచి నమూనాలను సేకరించారు. కల్తీ కల్లు విక్రయించినట్లు నిర్ధారణ అయినా, అనుమతులు లేకుండా కల్లు దుకాణాలు నిర్వహించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మెదక్ ఎక్సైజ్ అధికారి ఏ. వెంకటేశ్, ఎస్ఐ టి. వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పాజీపల్లి గ్రామంలో భూభారతి, డిజిటల్ సర్వేపై రైతులకు అవగాహన!

- తహసిల్దారు శ్రీనివాస్ రెడ్డి



**బాలానగర్, అక్టోబర్ 27(జనంసాక్షి):** బాలానగర్ మండలం అప్పాజీపల్లి గ్రామంలో మంగళవారం భూభారతి డిజిటల్ సర్వేపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి రైతులకు డిజిటల్ సర్వే విధానం, భూముల వివరాల నమోదు, సర్వే ప్రక్రియకు సంబంధించిన అంశాలను వివరించారు. రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని, డిజిటల్ సర్వే సమయంలో అధికారులకు అవసరమైన సమాచారం అందించి సహకరించాలని తహసీల్దార్ సూచించారు. భూముల వివరాల్లో ఏవైనా సమస్యలు ఉంటే సర్వే సమయంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అప్పాజీపల్లి గ్రామంలో 683.05 ఎకరాలు, శేరిగూడ గ్రామంలో 373.36 ఎకరాల భూమికి డిజిటల్ సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేతావత్ వెంకటేష్ నాయక్, ఆర్ఐ ఇనాయత్ అలీ, సర్వేయర్ జుబేర్తో పాటు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## చేపల విడుదలకు టెండర్ ప్రకటన

**నారాయణపేట, అక్టోబర్ 27(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా మత్స్యశాఖ ఆధీనంలో గల 641 చెరువుల గాను 202 6-27 సంవత్సరమునకు 187.44 లక్షల చేప పిల్లల సరఫరాకు టెండర్ పిలవ టం జరిగిందని జిల్లా మత్స్యశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యశాఖ, డైరెక్టర్, తెలంగాణ, హైదరాబాద్ గారు ఆదేశానుసారం 50శాతం పైబడిన నీరు వచ్చిన చెరువులకు చేప పిల్లల సరఫరా చేయుటకు, నీటిపారుదల శాఖ, నారా యణపేట జిల్లా నివేదిక ప్రకారం జిల్లాలో 25 చెరు వులకు 50 శాతం నీరు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. వీటికి 46.55 లక్షలు చేప పిల్లల సరఫరా చేయటం ప్రణాళిక సిద్ధము చేయడం జరిగిందనీ తెలిపారు.

## ఎరువుల దుకాణాలు, గోదాముల్లో అధికారుల తనిఖీలు

- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి



**గుండుమల్, అక్టోబర్27 (జనంసాక్షి):** మండలంలోని పలు ఎరువుల విక్రయ కేంద్రాలు, గోదాములను జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, సహాయ వ్యవసాయ సంచాలకుడు నూతన్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, నిల్వల రికార్డులు, విక్రయాల వివరాలను పరిశీలించారు. ఎరువుల నిల్వలు, విక్రయాల్లో నిబంధనలు పాటించాలని సూచించారు.

అనంతరం మండల సర్పంచులతో సమావేశమై ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడిపై చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండించే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ పంటల సాగుపై ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు.

వరి కోతల అనంతరం పంట అవశేషాలను పొలాల్లో కాల్చవద్దని, వాటిని తగిన పద్ధతుల్లో నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రేష్మారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి హర్షవర్ధన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో చెరుకు తోట బూడిద!



**రాజోళి/వడ్డేపల్లి, అక్టోబర్ 27(జనంసాక్షి):** వడ్డేపల్లి మండలం గాంధీనగర్లో మంగళవారం సుబాబుల్ కర్రల లోడుతో వెళ్తున్న లారీకి విద్యుత్ తీగలు తగలడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి చిట్టెమ్మ సాగు చేసిన పది ఎకరాల చెరుకు తోట దగ్ధమైనట్లు సమాచారం. ఈ ఘటనలో సుమారు రూ.15 లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా. అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి బాధిత రైతుకు ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక రైతులు, గ్రామస్థులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ, అప్పటికే మంటలు ఉధృతంగా వ్యాపించాయి. చేతికందే దశలో ఉన్న పంట కళ్ల ముందే బూడిదవడంతో బాధిత రైతు కుటుంబం కన్నీరు మున్నీరవుతోంది. లారీల రాకపోకల సమయంలో విద్యుత్ తీగలు తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# 15వ రోజుకు చేరుకున్న ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల రిలే దీక్షలు

**నారాయణపేట, అక్టోబర్ 27 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం టీజీ ఎన్.హెచ్.ఏం జేఏసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగవారం నాటితో నారాయణపేట జిల్లాలో 15వ రోజుకు చేరుకున్నాయి. 15వ రోజు ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ద్వారా తమ డిమాండ్లను తెలియజేస్తూ పోస్టు కార్డులపై తమ డిమాండ్లను రాసి పోస్టు చేశారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్క్ వద్ద ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల నిరసన శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ మాజీ డిసిసి అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి స్థానిక మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ శివారెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి వామన గేరీ సంతోష్ కుమార్, ఎమ్మెల్యే పీఏ చిట్టెం మాధవ రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కుంభం శివకుమార్ రెడ్డి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల డిమాండ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా ఎన్.హెచ్.ఎం. రిలే దీక్షలకు




బీజేపీ రాష్ట్ర డాక్టర్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి స్థానిక మాజీ బీజేపీ జిల్లా అధ్యక్షులు పగడకుల శ్రీనివాస్ తో కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఎన్.హెచ్.ఏం ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు తమ పార్టీ తరుపున డాక్టర్ సెల్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్.హెచ్.ఎం. ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తామన్నారు. ఈ సందర్భంగా సమ్మె ఖర్చులకు గాను తనవంతుగా రూ. 8 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్.హెచ్.ఎం యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బిక్షపతి, ప్రధాన కార్యదర్శి వెంకట రమణ, కోశాధికారి రాఘవేందర్, సభ్యులు నరసింహారావు సగరి, మోనేష్ చారి, కిరిటి, తిరుపతి, ఐశ్వర్య, వైష్ణవి, శీల హరిచందన, నవ్య దీప్తి, శ్వేత శ్రీ, రామస్వామి, వినోద్, నరేందర్, సౌందర్య, గాయత్రి, నాగజ్యోతి, పుష్ప, సావిత్రమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై మాజీ ఎమ్మెల్యే సమీక్ష

**రాజోళి, అక్టోబర్ 27(జనంసాక్షి):** రాజోళి మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని మంగళవారం అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హసన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని లక్ష్మీ వైకుంఠ నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ, ఎన్నికల ఇన్‌చార్జి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ..అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి ఓటరు నమోదుకు సహకరించాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుమార్, కాంగ్రెస్ నాయకులు హసన్, దస్తగిరి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# బైక్ మెకానిక్ అదృశ్యం

- భర్త ఆచూకీ కోసం పోలీసులను ఆశ్రయించిన భార్య.. కేసు నమోదు



**తెలకపల్లి, అక్టోబర్ 27 (జనంసాక్షి):** బైక్ మెకానిక్ అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మంగళవారం ఈ సందర్భంగా స్థానిక ఎస్సై యం. రమేష్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామానికి చెందిన శేఖర్ అనే బైక్ మెకానిక్ ఇంటి నుంచి పనిమీద బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన భార్య జరుపతి వరలక్ష్మి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వరలక్ష్మికి, శేఖర్‌కు ఏడేళ్ల క్రితం వివాహమైందని వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. శేఖర్ మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ ప్రతిరోజూ ఇంటి నుంచి దుకాణానికి వెళ్లి తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో అక్టోబర్ 25న ఉదయం షాపులో పని ఉందని చెప్పి ఇంటి నుంచి తెలకపల్లికి వెళ్లాడు. పని ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చాడు.

అనంతరం అదే రోజు సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో మళ్లీ పని ఉందంటూ ఇంటి నుంచి వెళ్లిన శేఖర్ రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. బంధువులు, తెలిసినవారి ఇళ్లతో పాటు వివిధ ప్రాంతాల్లో వెతికినప్పటికీ శేఖర్ ఆచూకీ లభించకపోవడంతో భార్య పోలీసులను ఆశ్రయించింది. అదృశ్యమైన వ్యక్తి వివరాలు: శేఖర్ నలుపు రంగు కలిగి, సుమారు ఆరు అడుగుల ఎత్తు ఉంటాడని, అదృశ్యమైన సమయంలో గులాబీ రంగు షర్టు, యాష్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యం. రమేష్ తెలిపారు.

# రైతుల భవిష్యత్తుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన శ్రీనివాస్ ముదిరాజ్

**తెలకపల్లి, అక్టోబర్ 27 (జనంసాక్షి):** రైతుల సంక్షేమం, పంటల సాగు, సాగునీటి నిర్వహణ, భూగర్భ జలాల పరిరక్షణపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని బీజేపీ నాగర్ కర్నూల్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు ఈర్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. రైతులు పంటలు సాగు చేయవద్దని సూచించే పరిస్థితులు ఎదురైతే, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి ప్రభుత్వం ఎలాంటి భరోసా కల్పిస్తుందని ప్రశ్నించారు. పంటల సాగుపై ఆంక్షలు లేదా పరిమితుల సూచనలు చేయడం మాత్రమే సరిపోదని, రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి, ఆర్థిక సహాయం అందించేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అన్నారు. వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యతకు అనుగుణంగా ఏ పంటలు సాగు చేయాలో వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.



**నీటి పరిరక్షణకు చర్యలేవి?**

రాష్ట్రంలో నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, సాగునీటి సమర్థ వినియోగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని శ్రీనివాస్ ముదిరాజ్ కోరారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, చెరువుల్లో నీటి నిల్వలను పెంచడం, నీటి వృథాను అరికట్టడం వంటి చర్యలు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. నీటి కొరత ఏర్పడిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు.

అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇసుక తవ్వకాల వల్ల నదులు, వాగులు, భూగర్భ జలాలపై పడే ప్రభావాన్ని గుర్తించి సహజ వనరులను పరిరక్షించాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, రైతుల సంక్షేమం, నిరుద్యోగుల సమస్యలు, సాగునీటి సౌకర్యాల కల్పనపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. రైతుల సమస్యలను ప్రకటనలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిష్కరించి, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు.

# ఓటే వజ్రాయుధం.. మాజీ ఎంపిటిసి హనుమంతు నాయక్

**వెల్దండ, అక్టోబర్ 27 (జనంసాక్షి):** ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని మాజీ ఎంపిటిసి హనుమంత నాయక్ అన్నారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకుని,ఆ దరఖాస్తును వెల్దండ మండల తహసీల్దార్ కార్తీక్ కుమార్‌కు అందజేశారు. మండలంలోని ఓటు నమోదు చేసుకోని అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్, మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



# వాల్మీకి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన

**మక్తల్, అక్టోబర్ 27 (జనంసాక్షి):** మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ పట్టణ శివారులో వాల్మీకి కమ్యూనిటీ హాల్ కోసం రెవెన్యూ అధికారులతో కలిసి స్థల పరిశీలన నిర్వహించినట్లు వాల్మీకి సంక్షేమ సంఘం అధ్యక్షులు రవికుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంత్రి వాకిటి శ్రీహరి వాల్మీకి జయంతి రోజున ఇచ్చిన హామీ మేరకు... 25 లక్షల రూపాయల నిధులతో వాల్మీకి కమ్యూనిటీ హాల్ ను వాల్మీకి సంఘం నాయకుల సూచనల మేరకు అతి త్వరలో నిర్మించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్థల పరిశీలన నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు తెలిపారు. వాల్మీకి సంక్షేమ సంఘం అభివృద్ధి కోసం మంత్రి వాకిటి శ్రీహరి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంక్షేమ సంఘం నాయకులు చిన్న కొండయ్య, సూర్య టైలర్ ఆంజనేయులు, చిన్న వెంకటేష్, చిన్నకురుమయ్య, నాగప్ప, కురుమయ్య, కతేపల్లి రాజు మరియు రెవెన్యూ సిబ్బంది బాల్ రాజు, రాజన్న,ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.



# ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది పోరాటానికి బీజేపీ అండగా ఉంటుంది

- డిమాండ్లు పరిష్కరించే వరకు దీక్షలు కొనసాగించాలి: బీజేపీ నాయకులు పురుషోత్తం రెడ్డి, పెద్దిరాజు

**వనపర్తి అక్టోబర్ 27 (జనంసాక్షి):** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న పోరాటానికి భారతీయ జనతా పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు తెలిపారు. జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో అక్టోబర్ 13 నుంచి కొనసాగుతున్న నిరసన దీక్షలు 15వ రోజుకు చేరుకున్న సందర్భంగా వారు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.



**ఈ సందర్భంగా పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ..** రాష్ట్రవ్యాప్తంగా 77 విభాగాలకు చెందిన సుమారు 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం నిరసనలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం, పీఆర్సీ అమలు, ఆరు నెలల ప్రసూతి సెలవులు, సీనియారిటీ ఆధారంగా రెగ్యులరైజేషన్ వంటి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రతిపక్షాల కార్యక్రమాలపై దృష్టి సారించే ప్రభుత్వం 15 రోజులుగా సిబ్బంది చేస్తున్న నిరసనలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూరుస్తున్నాయని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆయన విమర్శించారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ.. హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్ర, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్ వంటి రాష్ట్రాల్లో ఎన్‌హెచ్‌ఎం సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినట్లు తెలిపారు. తెలంగాణలోనూ సిబ్బందికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవలందించిన వైద్య సిబ్బందిని ఇప్పటివరకు ఎందుకు రెగ్యులరైజ్ చేయలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు.

ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది డిమాండ్లు నెరవేరే వరకు దీక్షలు కొనసాగించాలని, వారి పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందని పెద్దిరాజు భరోసా ఇచ్చారు. సిబ్బంది సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని వారు కోరారు.

## మహిళలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయండి

**మల్దకల్, అక్టోబర్ 27 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఓట్ల కోసం ఉచిత ప్రయాణం కల్పించి పురుషులకు తీవ్ర అసౌకర్యం కల్పిస్తున్నదని మెజారిటీ పురుష ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుండి రాత్రి వరకు ఏ బస్సు ఎక్కిన సీటు లేక పురుష ప్రయాణికులు టికెట్ ఖరీదు చేసి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. తెలంగాణ రాష్ట్రంలో సగభాగం మహిళలు ఉన్నారు వారికి ఉచిత ప్రయాణం కల్పించి రాష్ట్ర ప్రభుత్వం లబ్ది పొందాల్సి వస్తే వారికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరుకున్నారు. అనేకమంది పురుష ప్రయాణికులు ఉద్యోగరీత్యా బస్సుల్లో వెళ్లాల్సి వస్తే నానా అగజాట్లు పడాల్సిన పరిస్థితి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్పించిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మహిళలపై అంత ప్రేమ ఉంటే వారికి ప్రత్యేక బస్సులు కల్పించి గౌరవించాలని కోరుతున్నారు.

### ప్రచారం కాదు..

## ప్రజలకు అభివృద్ధి కావాలి

**వనపర్తి, అక్టోబర్ 27 (జనంసాక్షి):** తాడిపర్తి మీదుగా తాండా, చెన్నూరు గ్రామాలకు వెళ్లే రహదారి దుస్థితిపై అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలు, ప్రచారాలు అభివృద్ధి కాదని, ప్రజలకు మెరుగైన రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు కల్పించడమే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. గ్రామీణ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను ఐక్యవేదిక అధ్యక్షుడు, నాయకులు డిమాండ్ చేశారు.



# ఎండిన పంటల పరిశీలనకు మాజీ ఎమ్మెల్యే బీరం పాదయాత్ర



- **చిన్నంబావి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి**
- **ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం చెల్లించాలి**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి విమర్శలు**

**చిన్నంబావి అక్టోబర్ 27 (జనంసాక్షి):** చిన్నంబావి మండలంలో ఎండిపోయిన పంటలను పరిశీలించి, నష్టపోయిన రైతుల సమస్యలను తెలుసుకునేందుకు మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పాదయాత్ర చేపట్టారు. మండలంలోని చెల్లెపాడు గ్రామం నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర కృష్ణా నది ఒడ్డున ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు



నిర్వహించిన అనంతరం ప్రారంభమైంది. అక్కడి నుంచి చిన్నంబావి వరకు రైతులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పాదయాత్ర కొనసాగించారు. చెల్లెపాడు నుంచి చిన్నంబావి వరకు పాదయాత్ర సాగిన మార్గంలో పొలాలను పరిశీలించిన బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఎండిపోయిన పంటలను చూసి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సాగు కోసం పెట్టుబడులు పెట్టినప్పటికీ పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలిస్తూ రైతుల సమస్యలను తెలుసుకున్నారు. చిన్నంబావి మండలంలో ఎండిపోయిన పంటలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీరం హర్షవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రైతుల కష్టాలను గుర్తించి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అందించామని బీరం హర్షవర్ధన్ రెడ్డి గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వల్లే రైతులు కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు.



సాగునీరు, విద్యుత్ సరఫరా విషయంలో ప్రభుత్వం రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. మూడేళ్లయినా లింకు కెనాల్ పనులు ముందుకు సాగలేదని ఆరోపణ సింగోటం--గోపాలదిన్నె లింకు కెనాల్‌కు సంబంధించిన పనుల్లో పురోగతి లేదని బీరం హర్షవర్ధన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నప్పటికీ లింకు కెనాల్‌కు సంబంధించిన తట్టం పనులు కూడా చేపట్టలేదని ఆరోపించారు. సాగునీటి సౌకర్యాలు మెరుగుపడితే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, ప్రభుత్వం ఈ పనులపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంట నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, కరువు పరిస్థితుల నుంచి రైతులను గట్టెక్కించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పాదయాత్రలో మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, ఉమ్మడి మండలాల ఇంచార్జ్, మాజీ సర్పంచ్ గోవింద్ శ్రీధర్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఈదన్న యాదవ్, ప్రస్తుత సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ బోర్ల నుంచి పరిశ్రమలకు నీటి తరలింపుపై చర్యలేవి?

- **తాగునీటి కొరత వేళ పరిశ్రమలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా**
- **అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆగ్రహం**
- **రైతులకు భూసేకరణ పరిహారం అందించాలి.. లేకుంటే ఖాళీ కడవలతో రోడ్లపైకి వస్తారు**
- **సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్**

**సంగారెడ్డి, అక్టోబర్27(జనంసాక్షి):** సంగారెడ్డి ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, వ్యవసాయ బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు నీటిని తరలించడంపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి, రానున్న రోజుల్లో నీటి వనరులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున తాగునీటి సమస్యను ముందుగానే అంచనా వేసి, పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జిల్లాలో తాగునీటి సరఫరా, వ్యవసాయ బోర్ల నుంచి పరిశ్రమలకు నీటి తరలింపు, భూసేకరణ పరిహారం తదితర అంశాలను ప్రస్తావిస్తూ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

**బోర్ల నీటిని తరలిస్తున్నా పట్టించుకోరా?**

గ్రామాల్లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు సరిపడా నీరు లేదని చెబుతున్న అధికారులు, అదే గ్రామాల పరిధిలో వ్యవసాయ బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు నీటిని తరలిస్తున్న వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని చింత ప్రభాకర్ నిలదీశారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వ్యవసాయ విద్యుత్‌ను వినియోగించుకుంటూ బోర్ల నుంచి నీటిని తోడిపోసి ట్యాంకర్లను నింపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారం అధికారులకు తెలిసే జరుగుతోందా? తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోర్ల నుంచి పెద్దఎత్తున నీటిని ఇతర అవసరాలకు తరలిస్తే భూగర్భ జలమట్టాలు మరింత పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో నీటి వనరుల వినియోగంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ బోర్ల నుంచి పరిశ్రమలకు నీటిని తరలిస్తున్న వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్యపై ముందస్తు కార్యాచరణ అవసరం

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షాలు తగ్గే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే కోరారు. సంగారెడ్డి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయ వనరులను గుర్తించాలని, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని సూచించారు. నీటి వనరుల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రజల అవసరాలకు ప్రాధాన్యత నిస్తూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజలకు తాగునీరు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజలు ఖాళీ కడవలతో రోడ్లపైకి వచ్చి ఆందోళనలు




చేసే పరిస్థితి ఏర్పడుతుందని స్పష్టం చేశారు. తాగునీటి సమస్యను రాజకీయ కోణంలో కాకుండా ప్రజల జీవనాధారానికి సంబంధించిన కీలక అంశంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

**భూసేకరణ పరిహారంలో రైతులకు అన్యాయం జరగొద్దు...**

పరిశ్రమల స్థాపన కోసం భూసేకరణ చేపట్టిన మునిదేవునిపల్లి ప్రాంతంలో కొందరు రైతులకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో పరిహారం అందలేదని చింత ప్రభాకర్ ఆరోపించారు. భూసేకరణ, పరిహారం పంపిణీ విషయంలో రెవెన్యూ అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. భూసేకరణకు సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలించి, పరిహారం అందని రైతులను గుర్తించాలని కోరారు. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని చింత ప్రభాకర్ పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సమస్య తీవ్రతను గుర్తించాలని, నీటి వనరుల దుర్వినియోగాన్ని అరికట్టి ప్రజలకు సకాలంలో తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా భూసేకరణ పరిహారం విషయంలో రైతులకు న్యాయం జరిగేలా సంబంధిత శాఖలు తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## క్లినికల్ శిక్షణకు దరఖాస్తులు




**గద్వాల, అక్టోబర్ 27(జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లాలోని పారామెడికల్ అభ్యర్థులకు ఇదొక సువర్ణావకాశం. జిల్లాలో ఎంఎల్‌టి, ఎంపిహెచ్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఏడాది పాటు క్లినికల్ ట్రైనింగ్ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఎం.హృదయరాజు మంగళవారం ఒక ప్రకటనలో అధికారికంగా వెల్లడించారు. అభ్యర్థులు తమ శిక్షణ కోసం ఎంచుకునే ఆసుపత్రిని బట్టి నిర్ణీత రుసుమును డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో శిక్షణ పొందాలనుకునే వారు రూ.1,500, అలాగే అలంపూర్ ఆసుపత్రికి రూ.1,000 డీడీ తీయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోదలచిన అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హత ధృవీకరణ పత్రాలతో పాటు, సంబంధిత డీడీని జతచేసి తమ కళాశాలల్లో సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులను సమర్పించడానికి నవంబర్ 10వ తేదీని ఆఖరి గడువుగా నిర్ణయించారు. గడువు దాటిన తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోరని అధికారులు స్పష్టం చేశారు. పారామెడికల్ రంగంలో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంచుకోవడానికి, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి ఈ క్లినికల్ అప్రెంటిస్‌షిప్ ఎంతో దోహదపడుతుంది. కాబట్టి గద్వాల జిల్లాలోని అర్హులైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి హృదయరాజు కోరారు.